ధాన్యం కొనుగోళ్లు త్వరగా పూర్తిచేయాలి

కలెక్టర్లతో సీఎం వీడియో కాన్ఫరెన్స్

హైదరాబాద్, నవంబర్ 26(నమస్తే తెలంగాణ): ధాన్యం కొనుగోళ్లను త్వరగా పూర్తి చేయాలని, రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని కలెక్టర్లను, అధికారులను సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశించారు. అక్రమాలకు పాల్పడే మిల్లర్లపై కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు. మంగళవారం ఆయన ధాన్యం కొనుగోళ్లపై మంత్రులతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. సన్న, దొడ్డు రకాలను వేర్వేరుగా సేకరించాలని, ధాన్యం విక్రయించిన రైతుకు చెల్లింపులు వెంటనే పూర్తిచేయాలని, సన్న రకాలకు బోనస్ ఇవ్వాలని ఆదేశించారు. రాష్ట్రంలో 66 లక్షల ఎకరాల్లో వరి సాగు కాగా ఇంకా 20 లక్షల ఎకరాల్లో పంట కోయాల్సి ఉన్నదని చెప్పారు. 30న జరిగే రైతు పండుగను కలెక్టర్లు సమన్వయం చేసుకుంటూ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సూచించారు.

రైతు సదస్సును సక్సెస్ చేయాలి

- 28 నుంచి 30వరకు మహబూబ్‌నగర్‌లో నిర్వహణ
- మంత్రులు తుమ్మల, దామోదర, జూపల్లి సమీక్ష

హైదరాబాద్, నవంబర్ 26(నమస్తే తెలంగాణ): మహబూబ్‌నగర్‌లో ఈ నెల 28 నుంచి 30 వరకు నిర్వహించే రైతు సదస్సును విజయవంతం చేయాలని మంత్రులు తుమ్మల, దామోదర, జూపల్లి అధికారులను ఆదేశించారు. సదస్సు ఏర్పాట్లపై సచివాలయంలో మంగళవారం ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ సదస్సుకు మొదటి రెండు రోజులు 5వేల చొప్పున రైతులు హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. 30న సదస్సుకు సీఎం రేవంత్‌రెడ్డి హాజరవుతారని, అన్ని జిల్లాల నుంచి కనీసం లక్ష మంది రైతులు పాల్గొంటారని పేర్కొన్నారు. ఆధునిక వ్యవసాయ యంత్ర సామగ్రి, వివిధ రకాల పంట రీతులు, ప్రభుత్వ పథకాలపై సంబంధిత శాఖలు ప్రదర్శన స్టాళ్లను ఏర్పాటు చేస్తాయని తెలిపారు. సదస్సును రాష్ట్రంలోని 560 రైతు వేదికల్లో ప్రత్యక్షప్రసారం చేయాలని ఆదేశించారు. సమావేశంలో రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు డాక్టర్ చిన్నారెడ్డి, తెలంగాణ వ్యవసాయ, రైతు సంక్షేమ కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి, ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, సీఎస్ శాంతికుమారి, డీజీపీ జితేందర్, వ్యవసాయ శాఖ కార్యదర్శి రఘునందన్‌రావు, ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు పాల్గొన్నారు.

వ్యవసాయ వర్సిటీని నంబర్ వన్‌గా నిలబెట్టాలి

అధికారులు, శాస్త్రవేత్తలతో మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు

హైదరాబాద్, నవంబర్ 26 (నమస్తే తెలంగాణ): ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయాన్ని దేశంలోనే నంబర్ వన్ స్థానంలో నిలబెట్టేందుకు అందరూ కృషి చేయాలని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. 60 ఏండ్ల క్రితం ప్రారంభమైన వర్సిటీని మరింత ముందుకు తీసుకెళ్లాలని సూచించారు. డిసెంబర్‌లో నిర్వహించే వర్సిటీ వజ్రోత్సవ ఉత్సవాలు (డైమండ్ జూబ్లీ) ఫ్లయర్, లోగోలను కమ్యూనిటీ సైన్స్ కళాశాల లో మంగళవారం మంత్రి తుమ్మల విడుదల చేశారు. ఆయన మాట్లాడుతూ ఉత్సవాలు వర్సిటీ భవిష్యత్తును నిర్ణయించేలా ఉండాలని తెలిపారు. వీసీ జానయ్య మాట్లాడుతూ ప్రభుత్వ, ప్రైవేటు రంగంలో వ్యవసాయ కళాశాలలను ప్రారంభించేందుకు తమ అనుమతి తప్పనిసరి ఉండాలని ఐకార్ సూచించినట్టు పేర్కొన్నారు. కార్యక్రమంలో తెలంగాణ వ్యవసాయ, రైతు సంక్షేమ కమిషన్ చైర్మన్ కోదండ రెడ్డి, రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ చిన్నారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కౌన్సిల్ సమావేశాలను విజయవంతం చేయండి

వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కాంతయ్య

హైదరాబాద్, నవంబర్ 26 (నమస్తే తెలంగాణ): రంగారెడ్డి జిల్లా శంషాబాద్‌లో డిసెంబర్ 7, 8 తేదీల్లో నిర్వహించనున్న వ్యవసాయ కార్మిక సంఘం కౌన్సిల్ సమావేశాలను విజయవంతం చేయాలని యూనియన్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కాంతయ్య, బాలమల్లేశ్ పిలుపునిచ్చారు. మంగళవారం హైదరాబాద్‌లోని సీపీఐ రాష్ట్ర కార్యాలయం ముగ్దుం భవన్‌లో విలేకరులతో వారు మాట్లాడారు. ఈ సమావేశాలకు ముఖ్య అతిథిగా సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు, బీకే ఎంయూ జాతీయాధ్యక్షుడు పెరిమ స్వామి హాజరుకానున్నట్టు పేర్కొన్నారు. ఈ సమావేశాల్లో జాతీయ ఉపాధిహామీ పథకంపై సెమినార్ నిర్వహించనున్నట్టు తెలిపారు. విద్యావేత్తలు, మేధావులు, కార్యకర్తలు పెద్దసంఖ్యలో తరలిరావాలని కోరారు.

లగచర్ల ఆగ్రహంలో అర్థముంది!

మొదటిపేజీ తరువాయి...

ఉన్నారని, భూమిలిచ్చేందుకు సిద్ధంగా లేమని చెప్తున్నారని తెలిపారు. అక్కడి వాస్తవ పరిస్థితులను ప్రభుత్వానికి నివేదించాలని కలెక్టర్‌ను ఆదేశించామని వివరించారు. ఈ విషయంపై త్వరలోనే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి కూడా ఎస్సీ, ఎస్టీ కమిషన్ తీసుకెళ్లాలని నిర్ణయించిందని వెల్లడించారు. ఇటీవల లగచర్ల గ్రామంతోపాటు చుట్టుపక్కల గ్రామాలను తమ కమిషన్ సందర్శించిందని, సంగారెడ్డి జైల్లో ఉన్న గిరిజన రైతులను స్వయంగా వెళ్లి కల్సిందని, క్షేత్రస్థాయి పరిశీలనలో విస్మయం కలిగించే విషయాలు వెలుగులోకి వచ్చాయని తెలిపారు. తమ పరిశీలనకు వచ్చిన విషయాలను 'నమస్తే తెలంగాణ'కు ఇచ్చిన ఇంటర్వ్యూలో బక్కి వెంకటయ్య వివరించారు.

లగచర్లలో మీరు క్షేత్రస్థాయిలో పర్యటించి వచ్చారు కదా.. పరిస్థితులు ఎలా ఉన్నాయి?

తీవ్రమైన భయానక పరిస్థితులు ఉన్నాయి. లగచర్లతోపాటు రోటిబండ, పులిచర్లకుంటతండాల్లోని గిరిజన రైతులు, ఆడబిడ్డలు, స్థానికులు, స్థానిక కాంగ్రెస్ నాయకులు కూడా తీవ్ర ఆందోళన చెందుతున్నారు. ఏ రాత్రికి ఏం జరుగుతుందోనని భయపడుతున్నారు. ప్రాణాలు పోయినా పంట భూములను ఇవ్వబోమని తెగేసి చెప్తున్నారు. రైతులే కాదు స్థానికంగా ఉన్న ప్రజాప్రతినిధులు కూడా ప్రభుత్వ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తున్నారు. కొడంగల్ మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ సీనియర్ నేత గురునాథ్‌రెడ్డి కూడా ఇక్కడ ఫార్మాసిటీ ఏర్పాటును వ్యతిరేకిస్తున్నారు. 'అవసరమైతే వేరేచోట భూములున్నాయని, అక్కడ కంపెనీలు ఏర్పాటుచేయాలని సీఎం రేవంత్‌రెడ్డికి చెప్పినా వినడంలేదు' అని ఆయన చెప్తున్నారు. ఇదే విషయాన్ని స్థానికులు కమిషన్‌కు కూడా చెప్పారు.

మీరు అక్కడికి వెళ్లిన తర్వాత ఏమనిపించింది? ప్రభుత్వానికి ఎలాంటి సిఫారసు చేస్తారు?

మేం లగచర్లలో పర్యటించిన సందర్భంలో అక్కడి పరిస్థితులు దారుణంగా ఉన్నట్టు గుర్తించినం. కలెక్టర్, అధికార యంత్రాంగంపై దాడిని ఎట్టి పరిస్థితుల్లోనూ సమర్థించడంలేదు. కానీ, ఈ నెపంతో అమాయక గిరిజనులపై దాడులకు పాల్పడటం సరికాదు. వందలాది పోలీసులు అర్ధరాత్రి గిరిజనగూడేలపై ఎందుకు దాడి చేశారన్నదే మా ప్రశ్న. పోలీసులు చట్టాన్ని తమ చేతుల్లోకి తీసుకోవడం సరికాదు. పోలీసులు తమ పరిధికి మించి ప్రవర్తించినట్టు కనిపిస్తున్నది. లగచర్లలో ఆందోళన జరిగిన రోజు ఆ ఘటనతో సంబంధంలేని వారిని కూడా పోలీసులు అరెస్ట్ చేసినట్టు మా కమిషన్ పరిశీలనలో వెల్లడయ్యింది. ప్రభుత్వం 2013 చట్ట ప్రకారం భూసేకరణ చేయాలి. రైతులను ఒప్పించి, మెప్పించి భూములు తీసుకోవాలె. బలవంతంగా సేకరించడం కరెక్ట్ కాదు. ఇదే విషయాన్ని ఉన్నది ఉన్నట్టుగా ప్రభుత్వానికి వివరించి, చేపట్టాల్సిన చర్యలపై తగిన సిఫారసులు చేస్తాం.

పోలీసులు తమను అకారణంగా కొట్టారని గిరిజనులు ఆరోపిస్తున్నారు. ఇది నిజమేనా? మీ పరిశీలనలో తేలిందేమిటి?

పోలీసులు గిరిజనులను కొట్టినట్టు తేలింది. గిరిజనుల ఆరోపణలు నిజమే. దాదాపు 20 రోజుల క్రితం అర్ధరాత్రి వేళ పోలీసులు గిరిజనతండాలపై దాడులు చేశారు. ఫార్మా కంపెనీకి భూములివ్వబోమని చెప్పిన వారితోపాటు సంబంధంలేని వారిని కూడా తీవ్రంగా కొట్టారు. మద్యం మత్తులో ఉన్న కొందరు పోలీసులు మహిళలని కూడా చూడకుండా విచక్షణారహితంగా చితకబాదారు. యువకులను దారుణంగా హింసించారు. బూటు కాళ్లతో ఇష్టమొచ్చినట్టు తన్నారు. కొందరు గాయపడ్డారు. వారు తమకు తగిలిన గాయాలను కూడా మాకు చూపించారు. ఇది ఉపేక్షించలేని విషయం. డీజీపీని, సంబంధిత పోలీసు అధికారులను కూడా దీనిపై వివరణ కోరుతాం.

అక్కడి పరిస్థితులు తెలుసుకున్న తర్వాత కలెక్టర్, ఎస్పీకి ఏమని ఆదేశాలు ఇచ్చారు?

లగచర్లలో భయాందోళనకర వాతావరణం నెలకొని ఉన్నది. కలెక్టర్, ఇతర అధికారులపై దాడి ఘటనతో సంబంధంలేని వారిని కూడా పోలీసులు నిర్బంధించినట్టు ఆడబిడ్డలు చెప్పిన్రు. అక్రమంగా పోలీసులు అరెస్టు చేసిన వారిని వెంటనే విడుదల చేయాలని కోరిన్రు. వెంటనే అక్కడినుంచి కలెక్టర్‌తో మాట్లాడి వాస్తవ పరిస్థితులను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని ఆదేశించినం. అమాయకులను వెంటనే విడుదలచేసేలా చర్యలు తీసుకోవాలని అడిషనల్ డీజీ, ఎస్పీ, పోలీసు అధికారులకు సూచించినం. బెయిల్ మంజూరుకోసం సాయం చేయాలని కూడా స్పష్టమైన ఆదేశాలు జారీ చేసినం. నిరపరాధులపై కేసులు పెట్టడం సరికాదు.

> **లగచర్ల బాధితులకు ఏమని భరోసా ఇచ్చారు?**
>
> అక్కడి రైతులను కలిసిన సందర్భంలో వారు తమ ఆవేదనను, ఆక్రోశాన్ని వెళ్లగక్కారు. ప్రభుత్వం పరిహారం ఇచ్చి సరిపెట్టాలని అనుకుంటున్నదని, కానీ, తాము వ్యవసాయం చేసుకోవడానికి భూమి ఇవ్వబోమని చెప్తున్నదని బాధితులు చెప్పారు. వారి ఆవేదనలో కూడా అర్థం ఉన్నది. వాస్తవాలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తాం అని చెప్పినం. మీ భూములను ఎవరూ గుంజుకోరని, ఆందోళనకు గురికావద్దని ధైర్యం చెప్పినం. మీకు ఎస్సీ, ఎస్టీ కమిషన్ అండగా ఉంటుందని భరోసానిచ్చినం.

ఈ ఘటనపై ముఖ్యమంత్రికి ఏమని నివేదిస్తారు?

అక్కడి క్షేత్రస్థాయి పరిస్థితులపై ఉన్నదిఉన్నట్టుగా నివేదించాలని వికారాబాద్ కలెక్టర్‌కు ఆదేశాలు జారీ చేసినం. అమాయకులకు బెయిల్ వచ్చేలా చర్యలు చేపట్టాలని ఎస్పీకి కూడా సూచించినం. ప్రభుత్వానికి నివేదించాలని ఆదేశించినం. వారు నివేదిక సమర్పించిన తర్వాత మా పరిశీలనలో తేలిన అంశాలపై నివేదికను సిద్ధంచేస్తాం. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి నివేదిక ఇస్తాం. ఫార్మా కంపెనీల ఏర్పాటుకు అక్కడి రైతులు ఎట్టిపరిస్థితుల్లోనూ భూములిచ్చేందుకు సిద్ధంగా లేరనే విషయాన్ని స్పష్టంగా చెప్తాం. రైతుల నుంచి బలవంతంగా భూములు తీసుకోవద్దని ప్రభుత్వానికి సూచిస్తాం.

అక్కడి గిరిజన మహిళలు మీతో ఏం చెప్పారు?

సోమవారం లగచర్లకు వెళ్లిన సందర్భంలో రైతులతోపాటు గిరిజన మహిళలను కలిసినం. ప్రభుత్వం ఏం చేసినా భూములివ్వబోమని తేల్చిచెప్తున్నరు. అమాయకులైన తమ భర్తలు, కొడుకులను అన్యాయంగా జైల్లో పెట్టారని గోడు వెళ్లబోసుకున్నారు. తమకున్న ఎకరం, అర ఎకరం భూమిని ప్రభుత్వం తీసుకుంటే తమ పరిస్థితేమిటని, తమ జీవనాధారం ఏమిటని ప్రశ్నిస్తున్నారు. ప్రభుత్వం ఇచ్చే డబ్బుతో తాము రాష్ట్రంలో ఎక్కడా భూమి కొనుక్కోలేమని, ఇప్పుడు రైతులుగా ఉన్న తాము కూలీలుగా మారాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తంచేశారు. రైతుకు, భూమికి మధ్య ఉండే పేగుబంధాన్ని తెంపడం సరికాదు.



కొడంగల్‌లో మాట్లాడుతున్న ఎల్‌హెచ్‌పీఎస్ జాతీయ అధ్యక్షుడు దస్రాం నాయక్

పచ్చటి పొలాల్లో పరిశ్రమలా?

- ప్రభుత్వ భూముల్లోనే పరిశ్రమలు ఏర్పాటు చేయాలి
- గిరిజన రైతుల భూములు తీసుకుంటే ఊరుకోం
- రైతులపై పెట్టిన కేసులను కొట్టివేయాలి
- ఎల్‌హెచ్‌పీఎస్ జాతీయ అధ్యక్షుడు దస్రాం నాయక్

కొడంగల్, నవంబర్ 26: ప్రభుత్వ భూముల్లో పరిశ్రమలు ఏర్పాటు చేస్తే అందరికీ ఆమోదయోగ్యంగా ఉంటుందని, పచ్చటి పంటలు పండే పొలాల్లో పరిశ్రమలు ఏర్పాటుచేయడం ఏమిటని ఎల్‌హెచ్‌పీఎస్ జాతీయ అధ్యక్షుడు దస్రాం నాయక్ ప్రశ్నించారు. మంగళవారం ఎల్‌హెచ్‌పీఎస్ భారత ముక్తి మోర్చా, రాష్ట్రీయ ముస్లిం మోర్చా, జాతీయ ఓబీసీ సంఘాల ఆధ్వర్యంలో చలో కొడంగల్ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అధికారంతో భూములు లాక్కుంటామంటే చూస్తూ ఊరుకునేది లేదని, రైతుల అభిప్రాయం మేరకు నడచుకోవాలని పేర్కొన్నారు. అభివృద్ధి చేయాలని ప్రభుత్వానికి ఆంకాంక్ష ఉంటే ప్రభుత్వ భూముల్లో పరిశ్రమలు ఏర్పాటు చేయాలని సూచించారు. లగచర్లలో ఎకరానికి రూ.10లక్షలు ఇచ్చి పరిశ్రమలకు కట్టబెట్టాలని సూచించడం విడ్డూరంగా ఉందని చెప్పారు. అర్ధరాత్రి కరెంటు తీసి అక్రమంగా అరెస్టులు చేయడాన్ని ప్రభుత్వం ఎలా సమర్థించుకుంటుందని ప్రశ్నించారు. విచ్చలవిడిగా కేసులు పెట్టడంతో లగచెర్ల, హకీంపేట, పోలెపల్లి, రోటిబండతండా, పెలిచెర్లకుంటతండాలో ప్రజలు భయభ్రాంతులకు గురయ్యారని తెలిపారు. అక్రమంగా పెట్టిన కేసులను ఎత్తివేయాలని, అరెస్టు చేసిన వారిని వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎరుకల హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు మోహన్‌కుమార్ ధర్మ, ఎల్‌హెచ్‌పీఎస్ రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు శాంతినాయక్, దళిత మహిళా నాయకురాలు ఉజ్వల, ఏమీసీ మోర్చా నాయకురాలు సంతోష, ఎల్‌హెచ్‌పీఎస్ గౌరవాధ్యక్షుడు గట్టిత నాయక్, జిల్లా అధ్యక్షుడు సూర్యనాయక్ పాల్గొన్నారు.

పాలమూరులో 'లగచర్ల లడాయి'

- డిసెంబర్ 2న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ రాక
- ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా గిరిజనులతో భారీ ఎత్తున నిరసన
- లగచర్ల బాధితులకు సంఘీభావం
- ఏర్పాట్లు చేస్తున్న గులాబీ నేతలు

మహబూబ్‌గర్, నవంబర్ 26 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : ఫార్మా కంపెనీని వ్యతిరేకిస్తున్న లగచర్ల బాధితులకు సంఘీభావంగా డిసెంబర్ 2న మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో భారీ ఎత్తున నిరసన ప్రదర్శన చేపట్టేందుకు గులాబీ దళం సిద్ధమైంది. సీఎం రేవంత్‌రెడ్డి సొంత నియోజకవర్గంలో ఫార్మా క్లస్టర్ ఏర్పాటుకు గిరిజనుల భూములను బలవంతంగా లాక్కోవడాన్ని నిరసిస్తూ.. గిరిజనులపై అక్రమ కేసులు బనాయించి జైల్లో పెట్టడాన్ని నిలదీస్తూ లగచర్ల బాధితులకు అండగా నిలిచేందుకు నిర్వహించే 'లగచర్ల లడాయి'కి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు పాలమూరుకు రానున్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో మాజీ మంత్రులు శ్రీనివాస్‌గౌడ్, లక్ష్మారెడ్డి మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి గిరిజన నేతలతో సమావేశమయ్యారు. లగచర్ల లడాయికి ప్రభుత్వం అనుమతిస్తుందా లేదా అనేది చర్చనీయాంశంగా మారింది.

గిరిజన సంఘాల నాయకుల అరెస్టు

పరిగి, నవంబర్ 26: లగచర్ల రైతులకు అండగా చలో కొడంగల్, రాజ్యాంగ పరిరక్షణ ర్యాలీకి వెళ్తున్న ఎల్‌హెచ్‌పీఎస్, బీఎంపీ, బీఎంఎం గిరిజన నాయకులను పోలీసులు ముందస్తు అరెస్టు చేసి పరిగి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఎల్‌హెచ్‌పీఎస్ గౌరవాధ్యక్షుడు, బీఎంపీ జిల్లా అధ్యక్షుడు పాత్లావత్ గట్యానాయక్, ఎల్‌హెచ్‌పీఎస్ భారత్ ముక్తి మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గోవింద్‌నాయక్, సేవాలాల్ సేన జిల్లా నాయకులు కొర్ర బాలకృష్ణ, శీనునాయక్, రవీందర్‌నాయక్, బాబునాయక్, హరిలాల్‌నాయక్‌ను పోలీసులు ముందస్తుగా అరెస్టు చేశారు. రైతులపై కేసులు ఎత్తివేయాలని, గిరిజన రైతులను బలి చేస్తే ఊరుకునేది లేదని, త్వరలో ప్రగతిభవన్ ముట్టడిస్తామని వారు హెచ్చరించారు.



పరిగి పోలీస్‌స్టేషన్ వద్ద గిరిజన నాయకులు

బీసీ కమిషన్ చైర్మన్ నిరంజన్ నిర్వహించిన బహిరంగ విచారణ తీరుపై అసహనం వ్యక్తం చేస్తున్న కులసంఘాల ప్రతినిధులు

బీసీ కమిషన్ బహిరంగ విచారణ పూర్తి

మొత్తం 1336 వినతులు : చైర్మన్ నిరంజన్

హైదరాబాద్, నవంబర్26 (నమస్తే తెలంగాణ): బీసీల స్థితిగతుల అధ్యయనంలో భాగంగా బీసీ కమిషన్ రాష్ట్రంలోని ఉమ్మడి పది జిల్లాలు, కమిషన్ కార్యాలయంలో చేపట్టిన బహిరంగ విచారణ మంగళవారం ముగిసినట్టు కమిషన్ చైర్మన్ నిరంజన్ వెల్లడించారు. బహిరంగ విచారణలో వివిధ కుల సంఘాలు, స్వచ్ఛంద సంస్థలు, వ్యక్తుల నుంచి మొత్తం 1336 వినతులు స్వీకరించినట్టు తెలిపారు. బీసీలకు జనాభా దామాషాలో రిజర్వేషన్లు కల్పించాలని చాలా సంఘాలు విన్నవించాయని, వాటిపై త్వరలోనే ప్రభుత్వానికి నివేదిక సమర్పిస్తామని చెప్పారు. విచారణలో బీసీ కమిషన్ సభ్యులు రాపోలు జయప్రకాశ్, తిరుమలగిరి సురేందర్, బాలలక్ష్మి రంగు, డిప్యూటీ డైరెక్టర్ శ్రీనివాస రావు, స్పెషల్ ఆఫీసర్ సతీష్‌కుమార్, తెలంగాణ బీసీ మహాసభ వ్యవస్థాపక అధ్యక్షుడు కొమ్ము శ్రీనివాస్ యాదవ్ పాల్గొన్నారు.

కమిషన్‌పై కులసంఘాల అసహనం

బీసీ కమిషన్ చైర్మన్ నిరంజన్ నిర్వహించిన బహిరంగ విచారణ తీరుపై కులసంఘాలు తీవ్ర అసహనం వ్యక్తంచేశాయి. బహిరంగ విచారణలో పాల్గొని తమ కులాల స్థితిగతులను వివరించేందుకు, బీసీ స్థితిగతులపై వినతులు సమర్పించి, సూచనలు చేసేందుకు మంగళవారం కమిషన్ కార్యాలయానికి వివిధ కుల సంఘాల ప్రతినిధులు, వ్యక్తులు తరలివచ్చారు. గ్రూపులవారీగా, వ్యక్తిగతంగా, సంఘాల తరపున సూచనలు చేశారు. వీటిపై చైర్మన్ నిరంజన్ అభ్యంతరం వ్యక్తం చేశారంటూ కులసంఘాల నేతలు మండిపడుతున్నారు. కేవలం వినతిపత్రాలు మాత్రమే ఇవ్వాలంటూ తమ అభిప్రాయాలు కూడా వ్యక్తం చేసే అవకాశమివ్వలేదని ఆగ్రహం వ్యక్తంచేశారు. అలాంటప్పుడు విచారణ ఎందుకు చేపట్టడమని ప్రశ్నించారు. ఇదేవిషయంపై ఏకంగా చైర్మన్ నిరంజన్‌తోనే పలు సంఘాల నేతలు వాగ్వాదానికి దిగడం గమనార్హం.

17 జిల్లాల్లో కొనసాగుతున్న సర్వే..

హైదరాబాద్, నవంబర్ 26 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో ఇంటింటి సర్వేలో భాగంగా సేకరించిన వివరాలను కంప్యూటరీకరణ చేసే ప్రక్రియ ప్రారంభమైంది. ఇప్పటివరకు సేకరించిన 20,86,707 నివాసాల సర్వే సమాచారాన్ని కంప్యూటరీకరించారు. రాష్ట్రంలో మొత్తం 1,17,89,076 నివాసాలను గుర్తించగా మంగళవారం నాటికి 1,10,18,102 నివాసాల సర్వే పూర్తి చేశారు. 16 జిల్లాలో 100 శాతం పూర్తికాగా, మరో 13 జిల్లాలో కొనసాగుతున్నది. డాటా ఎంట్రీ ఆపరేటర్, ఎన్యుమరేటర్లు కలిసి సర్వే వివరాలను నమోదు చేస్తున్నారు.

నిర్బంధం మధ్య అంత్యక్రియలా?

- సాయిరెడ్డి మరణంపై రేవంత్‌రెడ్డి సమాధానం చెప్పాలి
- బీఆర్ఎస్ నాగర్‌కర్నూల్ జిల్లా అధ్యక్షుడు గువ్వల బాలరాజు

నాగర్‌కర్నూల్, నవంబర్ 26 : సీఎం రేవంత్ సొంతూరు కొండారెడ్డిపల్లిలో పోలీసుల నిర్బంధం మధ్య మాజీ సర్పంచ్ సాయిరెడ్డి అంత్యక్రియలు నిర్వహించడం దురదృష్టకరమని మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ నాగర్‌కర్నూల్ జిల్లా అధ్యక్షుడు గువ్వల బాలరాజు ఆవేదన వ్యక్తం చేశారు. మంగళవారం నాగర్‌కర్నూల్‌లోని బీఆర్ఎస్ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. సీఎం సొంతూరులో రెండుసార్లు ఏకగ్రీవ సర్పంచ్‌గా పనిచేసిన సాయిరెడ్డి మృతి చెందితే.. పోలీసుల నిర్బంధాల మధ్య అంత్యక్రియలు నిర్వహించడం బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. సాయిరెడ్డి మరణంపై రేవంత్‌రెడ్డి సమాధానం చెప్పాలని నిలదీశారు. సాయిరెడ్డి ఇంటికి దారి లేకుండా కక్ష్యసాధింపుగా గోడకట్టగా, సాయిరెడ్డి దంపతులు గోడ కట్టేందుకు తీసిన గుంతలోనే కూర్చొని నిరసన తెలిపారని గుర్తు చేశారు. సమావేశంలో కల్వకుర్తి మున్సిపల్ చైర్మన్ ఎడ్మ సత్యం, అచ్చంపేట మాజీ మున్సిపల్ చైర్మన్ నర్సింహాగౌడ్, మాజీ జడ్పీటీసీ శ్రీశైలం, రఘువర్ధన్‌రెడ్డి పాల్గొన్నారు.

బాపూఘాట్ అభివృద్ధికి భూమి ఇవ్వండి:రేవంత్

హైదరాబాద్, నవంబర్ 26(నమస్తే తెలంగాణ): ఈసా, మూసీ నదుల సంగమ స్థలంలోని బాపూఘాట్ అభివృద్ధికి రక్షణశాఖ పరిధిలోని 222.27 ఎకరాల భూమిని రాష్ట్ర ప్రభుత్వానికి బదిలీ చేయాలని రక్షణ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్‌కు సీఎం రేవంత్‌రెడ్డి విజ్ఞప్తిచేశారు. ఢిల్లీ పర్యటనలో ఉన్న సీఎం మంగళవారం కేంద్ర మంత్రులతో భేటీ అయ్యారు.

ఎకరం రూ.6 లక్షలకు ఎలా ఇస్తారు?

- రైతులకు అడ్వాన్సు ఇచ్చాకే భూములు తీసుకోండి
- ఎన్‌హెచ్‌ఏఐ అధికారులకు మంత్రి కోమటిరెడ్డి స్పష్టీకరణ

హైదరాబాద్, నవంబర్ 26 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో రహదారుల నిర్మాణానికి అవసరమైన భూములను సేకరించడంలో ఎన్‌హెచ్‌ఏఐ అధికారులు తీవ్ర జాప్యం చేస్తున్నారని రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. భూముల సేకరణకు ఒక్కో రాష్ట్రంలో ఒక్కో ధర చెల్లించడం ఏమిటని, తెలంగాణలో రూ.6 లక్షలకు ఎకరా భూమి ఇవ్వాలంటే ఎలా ఇస్తారని ప్రశ్నించారు. రహదారుల నిర్మాణంలో భూములు కోల్పోతున్న రైతులకు తొలుత అడ్వాన్సు చెల్లించాలని, ఆ తర్వాతే వారి నుంచి భూములు తీసుకోవాలని సూచించారు. రాష్ట్రంలో నిర్మించే జాతీయ రహదారుల పురోగతిపై మంగళవారం ఆయన సచివాలయంలో సమీక్ష నిర్వహించారు. నాగ్‌పూర్-విజయవాడ కారిడార్‌లో భూసేకరణకు 1,023 డ్రాఫ్ట్ అవార్డులు ఎన్‌హెచ్‌ఏఐ వద్ద పెండింగ్‌లో ఉండటంపై మంత్రి ప్రశ్నించారు. బీహార్‌లో ఎన్‌హెచ్‌ఏఐ ఎకరాకు 20 లక్షల చొప్పున నష్టపరిహారం చెల్లిస్తున్నదని మంత్రి పేర్కొంటూ.. తెలంగాణలో మాత్రం రూ.6 లక్షలకే ఇవ్వమంటే ఎవరు ఇస్తారని అధికారులను ప్రశ్నించారు. రాష్ట్రంలో భూముల విలువ ఆధారంగా రైతులకు నష్టపరిహారం చెల్లించాలని కోరుతూ కేంద్ర రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీకి లేఖ అందజేస్తానని చెప్పారు. సంగారెడ్డి, నర్సాపూర్, తూప్రాన్, చౌటుప్పల్ ప్రాంతాలను కలిపే ట్రిపుల్‌ఆర్ ఉత్తర భాగానికి (158.64 కి.మీ) సాధ్యమైనంత త్వరగా డీపీఆర్ రూపొందించాలని, డిసెంబర్ చివరి వారం లేదా జనవరి మొదటి వారంలో టెండర్లు పిలిచేందుకు చర్యలు చేపట్టాలని ఆదేశించారు.

కోటా కాటగలుస్తుందా?

మొదటిపేజీ తరువాయి...

న్యాయమూర్తుల ధర్మాసనం 2010లో కీలకమైన తీర్పు చెప్పింది. స్థానిక సంస్థల్లో బీసీ రిజర్వేషన్ల స్థిరీకరణకు అర్టికల్ 340 ద్వారా డెడికేటెడ్ కమిషన్‌ను ఏర్పాటుచేయాలని, ఆ కమిషన్ మాత్రమే ఆయా వర్గాల రాజకీయ వెనకబాటుతనాన్ని గ్రామస్థాయిలో శాస్త్రీయ పద్ధతిలో స్వతంత్రంగా అధ్యయనం చేసి, మొత్తం రిజర్వేషన్లు 50% మించకుండా ఓబీసీలకు రిజర్వేషన్లు కల్పిస్తూ సిఫారసులు చేయాలని నిర్దేశించింది. డెడికేటెడ్ కమిషన్ సిఫారసులు లేకుండా బీసీలకు రిజర్వేషన్లు కల్పించవద్దని తేల్చిచెప్పింది. ట్రిపుల్ టీ పేరిట మార్గదర్శకాలు జారీ చేసింది. ఆ తీర్పును దేశంలోని అన్ని రాష్ట్రాలు పాటించాల్సిందేనని మహారాష్ట్రకు చెందిన వికాస్‌రావు గవాళి కేసులో స్పష్టంచేసింది. ఇదే విషయాన్ని ఇటీవల తెలంగాణ హైకోర్టు కూడా రాష్ట్ర ప్రభుత్వానికి తేల్చిచెప్పింది. ఈ నేపథ్యంలోనే ప్రభుత్వం బూసాని వెంకటేశ్వరరావు చైర్మన్‌గా డెడికేటెడ్ కమిషన్‌ను ఏర్పాటుచేసింది.

**డెడ